# అలుక అనర్థం సుమా



**కష్టమనునయసుఖ**
**కాంక్షణ శీలయా కృతం కుర్వత్యా**
**సరళస్వభావోపిప్రియో**
**అవినయం మార్గం బలాన్నీతః**

**భావం:** ప్రియమైన భర్తనుంచి అనునయ సుఖాన్ని పొందాలన్న కోరికగల ఆమె వలన అతడుమంచివాడయినప్పటికీ బలవంతంగా తప్పుదారికి ఈడవబడ్డాడు.

అమ్మాయిని అత్తవారింటికి పంపిస్తూ అమ్మలు జాగ్రత్తలు చెప్తారు. " అమ్మాయీ, అత్తవారింటిలో భయ భక్తులతో మెలుగు. అందరికీ సేవలు

చెయ్యి. ఇంటిపనీ, వంటపనీ శ్రద్ధగా చెయ్యి. పుట్టింటి పరువు నిలుపు." అని కొందరు చెప్తారు. " ఇదిగో అమ్మాయీ జాగ్రత్త దాష్టీకాన్ని సహించకు. ఎంత తొందరగా వీలయితే అంత తొందరగా వేరు కాపురం పెట్టించు" అని మరి కొందరు చెప్తారు. ఏ సలహా ఎప్పుడు పనిచేస్తుందో, ఎప్పుడు వికటిస్తుందో చెప్పడం కష్టం.

రత్నప్రభ అందాల యువతి. మనోహరుడామెను ఏరికోరి వరించాడు. ఆమె కాపురం మూడు పువ్వులు ఆరుకాయలుగా ఉంటుందని అందరూ అనుకున్నారు. ప్రేమించి పెళ్ళాడిన వాడు తప్పక సుఖపెడతాడు కదా అనుకున్నారు.

కాపురానికి వెడుతున్న రత్నప్రభతో తల్లి " నీ భర్త నిన్ను ఇష్టపడి పెళ్ళాడిన మాట వాస్తవమే. కానీ అతని మీద అప్పుడప్పుడూ కోపం ప్రదర్శిస్తూ ఉండు. అప్పుడే నీకు అనుకూలుడిగా ఉంటాడు. లేకపోతే అతనికి లోకువైపోతావు." అని చెప్పి పంపించింది. రత్నప్రభకి తల్లి మాటలు నచ్చాయి. ఆమె చీటికీ మాటికీ భర్తపై అలిగేది. అతను ఆమెను అనునయించి అలుక తీర్చి బహుమతులు ఇచ్చేవాడు. గాంధార దేశం నుంచి నర్తకీమణి రాజాస్థానానికి వచ్చింది. నగరంలో ప్రముఖులలో ఒకడిగా మనోహరునికి పిలుపు వచ్చింది. నాట్యమయ్యేక సభామర్యాద ప్రకారం అందరితోపాటు అతడూ ఒక రత్నహారాన్ని నర్తకికి బహూకరించాడు. ఇంటికి వచ్చేసరికి రత్నప్రభ కోపంగా కన్పించింది. మనోహరుడు కారణం ఊహించి " సభామర్యాద ప్రకారమే రత్నహారాన్ని ఇచ్చాను." అన్నాడు. " కాదు ఆమె మీద మనసైంది." అంది రత్న

" లేదు రత్నా నా మాటలు నమ్ము" అన్నాడు. కానీ రత్నప్రభ నమ్మలేదు. చివరి ప్రయత్నంగా రెండు వజ్రాల హారాలు చేయించి ఇచ్చాడు.

మరొక్కసారి వ్యాపార సంబంధంగా సమావేశం జరిగింది. వర్తకులందరూ క్రయ విక్రయాల విషయమై మాట్లాడుకుని ఒక అవగాహనకు

వచ్చారు. చర్చలు సఫలమైనందుకు అందరూ ఒకరిని ఒకరు చందన తాంబూలాలతో సత్కరించుకున్నారు. ఇంటికి వచ్చిన మనోహరుని రత్నప్రభ "చందన మద్దిన సరసాంగి ఎవరో తాంబూలమందించిన తరుణి ఎవరో" అంది. రత్నవర్తకుల సమావేశంలో..." అంటూ చెప్పబోతుండగానే అబద్ధాలాడవద్దు. మీ తిరుగుళ్ళకి అడ్డురాను." అంది.

మనోహరుడామెను అనునయించి అలక తీర్చాడు. అలుకలూ, అనునయం రత్నప్రభకి నచ్చినా మనోహరుడి మనస్సులో రకరకాల ఆలోచనలని కదిలించాయి. "ఇంతగా అనుమానిస్తోంది. అనుమానం నిజంచేస్తే ఈమె తిక్క కుదురుతుంది." అని కోపంగా అనుకున్నాడు. కోపం కోరికగా మారింది. కాళ్ళు సానివాడవైపు కదిలాయి. అందగాడూ, ధనవంతుడూ అయినవాడు అందుబాటులో ఉన్నాడని అంగనలు అర్రులు చాచారు. అనునయ సుఖం మాత్రమే కోరుకుని రత్నప్రభ అతిగా అలిగింది. అతడు తప్పుదారిలోవెళ్ళేలా చేసింది. అమ్మలూ జాగ్రత్త, అమ్మాయిలూ జాగ్రత్త.

******